క్లుప్తంగా

కొలువులు సాధించిన సోదరులకు సన్మానం



పాండునాయక్ దంపతులు, కుమారులను సన్మానిస్తున్న నాయకులు

మర్పల్లి: యువత కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, మర్పల్లి ఎస్ఐ సురేష్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని గుర్రంగట్టు తండాకు చెందిన పాండునాయక్ కుమారులైన అంబర్‌సింగ్, జైసింగ్‌లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సందర్భంగా సన్మానించారు. ఇటీవల పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా అంబర్‌సింగ్, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా జైసింగ్ కొలువులు సాధించారు. దీంతో కాంగ్రెస్ నేత రవీందర్‌తోపాటు మర్పల్లి ఎస్ఐ సురేష్ యువకులను సత్కరించారు. అలాగే పాండునాయక్ దంపతులను కీర్తించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంతోశ్‌కుమార్, నాయకులు నిఖిల్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, బల్వంత్‌రెడ్డి, రాఘవేందర్, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించండి

గ్రామాల్లో సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా మహిళా కన్వీనర్ సావిత్రమ్మ

కొడంగల్ రూరల్: గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి వీలుగా అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా మహిళా కన్వీనర్ కె.సావిత్రమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని కస్తూర్‌పల్లిలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో అమలు చేస్తున్నారని, తమిళనాడు ప్రభుత్వం స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలు చేయడానికి అసెంబ్లీలో చట్టం చేస్తామని ప్రకటించిందని తెలిపారు. రాష్ట్రంలో సైతం ఇలాంటి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యశోద, నారాయణరెడ్డి, నరసమ్మ, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం



అలంకరణలో అమ్మవారు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని సిద్దనొంపు దారిలో వెలసిన శ్రీనందవరం చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సాయంత్రం జల్దిబిందె అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. విశేష అలంకరణ, అష్టోత్తర శతనామావళి, మంగళహారతులు అందిస్తూ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం 5గంటలకు జ్యోతి ఉత్సవాలు, ఒంటి గంటకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సంకారపు పవన్‌కుమార్, సంకారపు శివకుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు పెరుగు బసంతం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యే టీఆర్‌ఆర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

పూడూరు: పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు మేకల రమేష్ ఓ ప్రకటనలో సోమవారం కోరారు. గతంలో కమతం రాంరెడ్డికి మంత్రి పదవి వరించడంతో ఈ ప్రాంతంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. అప్పటి నుంచి నేటి వరకు నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కలేదని అన్నారు. విద్యావంతుడైన రామ్మోహన్‌రెడ్డికి జిల్లాపై మంచి అవగాహన ఉందని, అందుకు ఆయనకి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహం నింపిన ఉగాది

బొంరాస్‌పేట: విశ్వావసు నామ సంవత్సరాది ఉగాది పండుగ మండలవాసుల్లో ఉత్సాహం నింపింది. ఆదివారం ఉదయం నుంచి షడ్రుచుల తయారీ, తీపి వంటలు, కొత్తబట్టలు, సాయంత్రం పంచాంగ శ్రవణాలు జరిగాయి. పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. రేగడిమైలారంలో అడుగుల భజన, నాందార్‌పూర్‌లో భజన కీర్తనల జాగరణ, మెట్లకుంటలో సోమవారం ఉదయం వరకు వీరబ్రహ్మంగారి వీధినాటకం ప్రదర్శన ఆకట్టుకుంది.



దోమ: రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కొడంగల్: మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో ముస్లింలు



అనంతగిరి: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



తాండూరుటౌన్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో చిన్నారి

భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్

నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సోమవారం వైభవంగా ఈద్ ఉల్ ఫితర్(రంజాన్) జరుపుకొన్నారు. ఉదయం నుంచే ఈద్గాలు, మసీద్‌లకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో రంజాన్ వేడుకలు పెద్దఎత్తున నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్



పరిగిలో రంజాన్ వేడుకలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



తాండూరుటౌన్: చెన్‌గేష్‌పూర్ మార్గంలోని ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



అనంతగిరి: ముస్లిం నేతలతో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



బంట్వారం: కోట్‌పల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దుద్యాల్: హస్నాబాద్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో..



దుద్యాల్‌లో స్థానిక నేతల సందడి



కొడంగల్‌రూరల్: అంగడిరాయిచూర్ గ్రామంలో..



పూడూరు: మన్నెగూడలో..



తాండూరుటౌన్: చిన్నారుల అలయ్ బలయ్



మోమిన్‌పేట్‌లో..



బషీరాబాద్: ముస్లిం మతపెద్దలకు శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు



తాండూరుటౌన్: ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



పూడూరు: కంకల్‌లో పండుగ శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు



ధారూరు: ఈద్గా వద్ద మత పెద్దలు



మర్పల్లి: ఈద్గా వద్ద ఈద్ ముబారక్ తెలుపుకొంటున్న నాయకులు

వీరశైవ సమాజం నూతన కమిటీ ఎన్నిక



కోట్‌పల్లి వీరశైవ సమాజం నూతన కమిటీ

బంట్వారం: వీరశైవ సమాజం కోట్‌పల్లి మండలం నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా పత్తి సంగమేశ్వర్, గౌరవ అధ్యక్షుడిగా గందె సురేష్, ప్రధాన కార్యదర్శిగా సునీల్, ఉపాధ్యక్షుడు మల్లేశం, సహకార్యదర్శి నిఖిల్, కోశాధికారిగా అమర్నాథ్ నియమితులయ్యారు. సభ్యులుగా చిత్రశేఖర్, గౌరీశంకర్, రాజేశ్వర్, పత్తి సాగర్, నరేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ఎన్నికైన సంగమేశ్వర్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు. వీరశైవ సమాజం అభివృద్ధికి పాటు పడతానని ఆయన తెలిపారు.

వక్ఫ్ బిల్లు సవరణపై నిరసన

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాలలో ఈద్గా వద్ద ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రంజాన్ పండగ సందర్భంగా గ్రామంలో ఉన్న ఈద్గా వద్ద ప్రార్థనల అనంతరం ముస్లింలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని, వక్ఫ్ బిల్లును సవరించడం సరికాదన్నారు. వక్ఫ్ బిల్లు దేశ లౌకికవాదానికి సంబంధించిన అంశం అన్నారు. మతాల కతీతంగా అందరూ ఈ బిల్లును వ్యతిరేకించాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బిందెంగడ్డ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధిహామీ కింద రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. గ్రామంలో అత్యవసరమైన తాగునీటి, విద్యుత్తు సౌకర్యం, మురుగుకాల్వల శుభ్రత వంటి మౌలిక సదుపాయాల అంశంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిలయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, నాయకులు శంకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



బిందెంగడ్డ తండాలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నేతలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బంట్వారం: తాండూరు విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా మంగళవారం బంట్వారం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కేశంపేట: అమ్మ హస్తం పథకంలో భాగంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం మండల కేంద్రానికి వస్తున్నట్లు ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దేశరక్షణలో యువత భాగం కావాలి



ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన సునీల్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: యువత దేశరక్షణలో భాగస్వాములు కావడం అభినందనీయమని బీఆర్‌ఎస్ పార్టీ చౌడాపూర్ ఉపాధ్యక్షుడు మఠం రాజశేఖర్ అన్నారు. ఇటీవల విడుదలైన అగ్నిపథ్ నియామకాల్లో భాగంగా మందిపల్ గ్రామానికి చెందిన ఈడిగి సునీల్ అగ్నివీర్ ఉద్యోగం సాధించాడు. కాగా సోమవారం ఆయన్ని గ్రామస్తులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ... యువత వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో చందు, సాయి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అదును చూసి.. అందినకాడికి

- ఆర్‌వైవీసీ దరఖాస్తుకు మీసేవా కేంద్రాలకు ప్రజలు
- కుల, ఆదాయ పత్రాల కోసం అధికంగా వసూలు



దుద్యాల్‌లోని మీ సేవా కేంద్రాల వద్ద జనం

దుద్యాల్: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి(ఆర్‌వైవీసీ) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ స్కీం కింద అర్హులకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు బ్యాంకు అనుసంధానంతో రాయితీ రుణాలు ఇవ్వనుంది. ఇందుకు అప్లికేషన్లను మార్చి 15 నుంచి ఈ నెల 5 వరకు ఆన్‌లైన్ ద్వారా తీసుకోనుంది. దీనికి దరఖాస్తుదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలి. ఇదే అదునుగా భావించిన కొందరు మీ సేవా కేంద్రాల నిర్వాహకులు యథేచ్ఛగా ఫీజుల రూపంలో దండుకుంటున్నారు. గడువు దగ్గర పడుతుండడంతో సర్టిఫికెట్లు లేని వారు మీ సేవా కేంద్రాల దోపిడీకి బలవుతున్నారు.


రూ.100 నుంచి రూ.200 వరకు

మీ సేవా కేంద్రాల్లో అప్లికేషన్ ఫీజు అధికంగా వసులు చేస్తున్నారు. ఒక్కో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రూ.45 మాత్రమే ప్రభుత్వం తీసుకుంటుంది. సర్వీస్ చార్జీతో కలిపి రూ.60 నిర్వాహకులు తీసుకోవాలి. కానీ మండలంలో ఉన్న కేంద్రాల్లో రూ.100 నుంచి రూ.150 వరకు వసులు చేస్తున్నారు. ప్రజలకు అత్యవసరం కాబట్టి ఎంత అడిగితే అంత ముట్టజెబుతున్నారు. అవసరాన్ని ఆసరాగా తీసుకుని కాసులు దండుకోవడం ఏంటని ప్రజలు మండిపడుతున్నారు. రాజీవ్ యువ వికాసం అప్లికేషన్‌కు కూడా రూ.50 తీసుకుంటే సరిపోతుంది. కానీ ఒక్కో దరఖాస్తుకు రూ.100 నుంచి రూ.200 వందల వరకు వసులు చేస్తున్నారు. ఇలా మోసం చేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి మీ సేవా సెంటర్లపై అధికారులు పర్యవేక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రెవెన్యూ కార్యాలయంలో ధ్రువపత్రాలకు వచ్చి చెట్ల నీడకు సేద తీరుతున్న మహిళలు

చర్యలు తీసుకుంటాం



ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు అప్లికేషన్‌కు అధికంగా వసులు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకోవడంతోపాటు కేంద్రాలను సీజ్ చేస్తాం. అప్లికేషన్‌కు సంబంధించిన ధరల పట్టిక ప్రజలకు కనిపించేలా అందుబాటులో ఉంచాలి. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తప్పవు.

– కిషన్, తహసీల్దార్, దుద్యాల్